## బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా బండి సంజయ్

కరీంనగర్ విద్యానగర్, జనవరి 3: బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బుధవారం వెల్లడించారు.

## అరుదైన వన్యప్రాణులు సేఫ్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 3(నమస్తే తెలంగాణ): అరుదైన వన్యప్రాణులతో ఏర్పాటుచేసిన ఎక్జాటిక్ యానిమల్ ఎగ్జిబిషన్‌కు అటవీశాఖ అధికారులు చెక్ పెట్టారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీ 9 ఫేజ్‌కు చెందిన భరత్‌రెడ్డి కొంతకాలంగా అరుదైన జాతులకు చెందిన ఇగునా, తొండ, పైథాన్, చేపలు, పాములు, ముండ్ల పందులు, ఉష్ట్రపక్షులతో ఎలాంటి అనుమతి లేకుండా ప్రత్యేక ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నాడు. జంతుప్రేమికుల ఫిర్యాదుల మేరకు ఎగ్జిబిషన్‌పై అటవీ అధికారులు దాడి చేసి, వన్యప్రాణులను రక్షించి సంరక్షణ కేంద్రానికి తరలించారు. నిర్వాహకుడిపై రూ.2 లక్షల జరిమానా విధించినట్టు మల్కాజిగిరి జిల్లా అటవీ శాఖాధికారి జానకీరాం వెల్లడించారు. అరుదైన వన్యప్రాణులను పెంచుకోవడం కూడా నేరమని, ప్రత్యేక అనుమతులు ఉంటేనే వీటిని పెంచుకోవాలని పేర్కొన్నారు.

## 'సచివాలయ ఉద్యోగులకు భూమి కేటాయింపు సబబే'

హైదరాబాద్, జనవరి 3, నమస్తే తెలంగాణ : ఏపీ సచివాలయ ఉద్యోగుల మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీకి రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం నెక్‌నాంపూర్‌లో 55 ఎకరాలు, శామీర్ పేట మండలం జవహర్‌నగర్‌లో 100 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం గతంలో జీవో 509 జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ ఓఎం దేబరమరొకరు 2010లో దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరధే, జస్టిస్ అనిల్ కుమార్‌ల ధర్మాసనం బుధవారం తీర్పు ఇచ్చింది. సచివాలయ ఉద్యోగుల సంఘ సభ్యుల ఇండ్ల స్థలాల నిమిత్తం భూమిని కేటాయించడాన్ని ధర్మాసనం సమర్థించింది.

కొత్తూరు సమీపంలోని రిసార్ట్ వద్ద పోలీసులు లాఠీచార్జ్ చేసి ఇరు వర్గాలను చెదరగొడుతున్న దృశ్యం

శ్యాంసుందర్‌రెడ్డి దాడిలో తగిలిన గాయాలను చూపుతున్న జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, మైనార్టీ నాయకుడు జానీ

# కొత్తూరులో 'జమ్మికుంట' రాజకీయం

- బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లపై కాంగ్రెస్ నాయకుల దాడులు
- లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు
- కాంగ్రెస్ దాడులను ఖండించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కొత్తూరు/షాద్‌నగర్, జనవరి 3: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీకి చెందిన రాజకీయాలు.. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలో వేడెక్కిస్తున్నాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్ల క్యాంపు రాజకీయంతో ఇరు పార్టీల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. పోలీసులు జోక్యం చేసుకుని లాఠీచార్జ్ చేసి ఇరువురిని శాంతింపజేశారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు ఉంటే.. అందులో 29 మంది బీఆర్ఎస్‌కు చెందిన వారే. అయితే.. బీఆర్ఎస్‌కే చెందిన కౌన్సిలర్ పొన్నగంటి మల్లయ్య అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. మల్లయ్య.. మరో 14 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి మంగళవారం సాయంత్రం కొత్తూరు మండలంలోని వైఎం తండా వద్ద ఉన్న రిసార్ట్స్‌లో క్యాంపు ఏర్పాటు చేశారు. తాజాగా.. ఆ 14 మంది కౌన్సిలర్లతో కలిసి మున్సిపాలిటీలో అవిశ్వాసం పెట్టాలని కరీంనగర్ కలెక్టర్‌ను కోరారు. అవిశ్వాసం పెట్టే వరకు వారిని దాచిపెట్టేందుకు కొత్తూరు మండలంలోని ఎంపీఎస్ రిసార్ట్‌కు తరలించారు. దీంతో అందులోని కొందరు కౌన్సిలర్లు ప్రస్తుతం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న రాజేశ్వర్‌రావుకు ఫోన్‌చేసి.. పొన్నగంటి మల్లయ్య తమను బలవంతంగా కొత్తూరు మండలంలోని ఎంపీఎస్ రిసార్ట్‌కు తీసుకొచ్చారని తెలిపారు. ఈ మేరకు చైర్మన్ తన అనుచరులతో కలిసి మంగళవారం రాత్రి రిసార్టుకు రాగా.. అక్కడ ఉన్న సిబ్బంది గేట్ తీయలేదు. బుధవారం ఉదయం మరోసారి ప్రయత్నించినా గేట్ తీయలేదు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు, కొత్తూరు మాజీ జడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి తన అనుచరులతో వారి దగ్గరికెళ్లి.. తమ కాంగ్రెస్ కౌన్సిలర్ల వద్దకు ఎందుకొచ్చారని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో శ్వాంసుందర్‌రెడ్డి అనుచరులు రాజేశ్వర్‌రావు, ఆయన అనుచరులపై దాడి చేశారు. ఈ దాడిలో రాజేశ్వర్‌రావుతోపాటు జమ్మికుంట మైనార్టీ నాయకుడు మహ్మద్ జానీ, జక్కలపల్లి సత్యనారాయణకు గాయాలయ్యాయి. అలాగే మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తనయుడు, కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ తన అనుచరులతో కలిసి రిసార్ట్ వద్దకు చేరుకున్నారు. తమ కౌన్సిలర్లను కలువాలని రిసార్ట్ వద్ద వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న కేశంపేట, కొత్తూరు పోలీసులు రిసార్ట్ వద్దకు చేరుకుని ఇరువర్గాలపై లాఠీచార్జి చేసి చెదరగొట్టారు.

### బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ దాడి గర్హనీయం

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావుతోపాటు బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకులపై కొత్తూరు మండలం కాంగ్రెస్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి దాడి చేయడం గర్హనీయమని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ దాడిపై ఆయన కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాపాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. సీఎం సొంత జిల్లాలో దాడులు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కౌన్సిలర్ పొన్నగంటి మల్లయ్య వద్ద సుపారి తీసుకొని శ్యాంసుందర్‌రెడ్డి జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావును కొత్తూరు మండలం ఇస్కుల్‌నర్వ గ్రామ పంచాయతీ పరిధిలోని జేపీ దర్గా సమీపంలో చంపే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వెంటనే శ్యాంసుందర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. పొన్నగంటి మల్లయ్యకు పెద్ద నేర చరిత్ర ఉందని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు ఆరోపించారు. మాయమాటలతో జమ్మికుంట కౌన్సిలర్లను కిడ్నాప్ చేసి మొదటగా హైదరాబాద్ తరలించి, అక్కడి నుంచి కొత్తూరు మండలం వైఎం తండా సమీపంలోని రిసార్ట్‌లో ఉంచారని విమర్శించారు. కౌన్సిలర్లు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## లోకం పోకడ

అంత భయపడితే ఎలాగండీ? ఆ వార్త చదివిన ప్రతిసారి టక్కున అలా లేచి నిలబడుతున్నారేం?

## విజయవాడ దుర్గగుడిలో భవానీ దీక్షల విరమణ

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో భవానీ దీక్షల విరమణ ప్రారంభమైంది. దీంతో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. భవానీ దీక్ష విరమణ కార్యక్రమం ఐదు రోజుల పాటు కొనసాగనున్నది. ముందుగా గిరి ప్రదక్షిణ చేసి, తర్వాత నేతి టెంకాయలను సమర్పించి భవానీలు దీక్షలను విరమింపజేస్తున్నారు. ఈ ఏడాది 5 లక్షలకు పైబడి దీక్షాదారులు వస్తారని అంచనా వేస్తున్నారు. గిరి ప్రదక్షిణలో భవానీ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 7న పూర్ణాహుతితో భవానీ దీక్షా విరమణలు పూర్తవుతాయి. ఇరుముడి సమర్పణకు మహా మండపంలో ప్రత్యేకంగా 150 స్టాళ్లు ఏర్పాటు చేశారు.

## డ్రోన్‌తో మెడిసిన్ రవాణాకు ట్రయల్ రన్

భువనగిరిలో విమానం ఆకారంలో తయారుచేసిన డ్రోన్ ట్రయల్ నిర్వహిస్తున్న నిర్వాహకులు

- 5 నిమిషాల్లో భువనగిరి నుంచి బీబీనగర్ ఎయిమ్స్‌కు తరలింపు
- త్వరలో ప్రారంభించనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

భువనగిరి అర్బన్, జనవరి 3 : భువనగిరి ప్రభుత్వ ఏరియా దవాఖాన నుంచి బీబీనగర్ ఎయిమ్స్‌కు అధునాతన పద్ధతిలో మెడిసిన్‌ను తరలించేందుకు విమానం ఆకారంలో డ్రోన్ తయారు చేసి ట్రయల్ నిర్వహించారు. ఇందులో భాగంగా భువనగిరిలో బుధవారంతో మూడు సార్లు ట్రయల్ రన్ విజయవంతం చేశారు. భువనగిరి ఏరియా దవాఖాన నుంచి మందులను ఐదు నిమిషాల్లోనే బీబీనగర్ ఎయిమ్స్‌కు తరలించారు. ఇది 25 కిలోల బరువును 30 కిలోమీటర్ల వరకు తీసుకెళ్తుందని డ్రోన్ నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రయోగం సక్సెస్ కావడంతో త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారికంగా ప్రారంభిస్తారని వారు పేర్కొన్నారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 11.9°c | 32.8°c |
| రంగారెడ్డి | 12.2°c | 33.0°c |
| మెదక్ | 14.1°c | 31.8°c |
| నల్లగొండ | 16.0°c | 31.4°c |
| వరంగల్ | 17.0°c | 28.0°c |
| కరీంనగర్ | 17.0°c | 29.0°c |
| నిజామాబాద్ | 17.7°c | 29.9°c |
| ఖమ్మం | 18.0°c | 30.0°c |
| మహబూబ్‌నగర్ | 18.5°c | 29.8°c |
| హైదరాబాద్ | 18.0°c | 27.8°c |

## బట్టలు చింపుకొని.. కేసు పెడతానని..

- కార్లలో లిఫ్ట్ అడుగుతూ బ్లాక్‌మెయిల్ చేస్తున్న కిలేడీ
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన జూబ్లీహిల్స్ పోలీసులు

నిందితురాలు సయీదా నయీమా సుల్తానా

బంజారాహిల్స్, జనవరి 3: రోడ్డుమీద వెళ్తున్న వారిని లిఫ్ట్ అడిగి కారులో ఎక్కడం.. తన బట్టలు తనే చింపుకొని రేప్ చేసేందుకు ప్రయత్నించినట్టు డ్రామా క్రియేట్ చేసి కేసులు పెడతానంటూ పలువురి వద్ద నుంచి డబ్బులు దండుకుంటున్న కిలేడీని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాబాద్ ప్రాంతానికి చెందిన సయీదా నయీమా సుల్తానా గత కొన్నేండ్లుగా హైదరాబాద్‌లోని ప్రధాన రోడ్లపై తిరుగుతూ కార్లలో వెళ్లేవారిని లక్ష్యంగా చేసుకొని బ్లాక్‌మెయిల్ చేస్తుంది. రాత్రిపూట రోడ్లపై లిఫ్ట్ ఇవ్వాలని ఖరీదైన కార్లను ఆపుతుంది. లిఫ్ట్ ఇచ్చిన వారితో మాటలు కలిపి డబ్బులు డిమాండ్ చేయడం ప్రారంభిస్తుంది. కోరినంత ఇవ్వకపోతే తన ఒంటిమీద బట్టలు చింపుకొని రేప్ చేసేందుకు ప్రయత్నిస్తున్నావని పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బ్లాక్‌మెయిల్ చేస్తుంది. దీంతో బెదిరిపోయి బాధితులు అడిగింత డబ్బులు ఇచ్చేవారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10గంటల ప్రాంతంలో కారులో వెళ్తున్న బంజారాహిల్స్ ఎన్బీటీ నగర్‌కు చెందిన పరమానంద్‌ను నయీమా లిఫ్ట్ అడిగింది. కారులో ఎక్కగానే రూ.1000 ఇవ్వాలని లేకుంటే అరిచి గోల పెడతానంటూ బెదిరింపులకు దిగింది. షాక్‌కు గురైన పరమానంద్ తన వద్ద డబ్బులు లేవని చెప్పాడు. డబ్బులు ఇవ్వకపోతే బట్టలు చింపుకుని రేప్ కేసు పెడతానని బెదిరించింది. దీంతో కారును నేరుగా బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌వద్దకు తీసుకువెళ్లిన పరమానంద్ ఆమెను కిందకు దిగాలని కోరగా నిరాకరించడంతో పాటు పీఎస్ ఎదురుగానే తన బట్టలు చించుకుని హల్‌చల్ చేసింది. కారులోంచి దిగి పరమానంద్ మీద దాడి చేయడంతోపాటు తనను జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి కారులో తీసుకొస్తూ రేప్ చేసేందుకు యత్నించాడంటూ వీరంగం సృష్టించింది. దీంతో బాధితుడు పోలీసులకు జరిగిన విషయాన్ని చెప్పాడు. ఘటన జరిగిన ప్రాంతం జూబ్లీహిల్స్ పరిధిలోకి వస్తుండటంతో అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడితోపాటు నిందితురాలు నయీమా సుల్తానాను జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించడంతో తప్పును అంగీకరించింది. బాధితుడి ఫిర్యాదుతో నిందితురాలిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నయీమా సుల్తానా మీద నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో గతంలో 16 కేసులు నమోదైనట్టు విచారణలో తేలింది. బాధితుల వద్ద నుంచి లక్షలాది రూపాయలు గుంజినట్టు తెలుస్తున్నది. ఇదిలాఉండగా తాను అడ్వకేట్‌నని, తనజోలికి వస్తే ఏయే సెక్షన్ల కింద కేసులు పెడతానో చూసుకోండి అంటూ పోలీసులను సైతం బెదిరించడం కొసమెరుపు.

## కేంద్రం ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలి

- హిట్ అండ్ రన్ కేసుల్లో మార్పులను రద్దు చేయాలి
- పలు కార్మిక సంఘాల డిమాండ్

న్యాయసంహిత చట్టాన్ని రద్దు చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

చిక్కడపల్లి/ హిమాయత్‌నగర్, జనవరి 3: భారత న్యాయ సంహిత చట్టంలోని హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించిన 104 సెక్షన్(1), (2) లను తక్షణమే రద్దు చేయాలని పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ (ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్) గ్రేటర్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య పార్కునుంచి చిక్కడపల్లి మెట్రో స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటేశ్ మాట్లాడుతూ.. డ్రైవర్ లేకుండా సమాజం అవసరాలు తీరవని, ప్రతిపాదనలు వెనక్కి తీసుకోక పోతే మోదీ బండిని ముందుకు కదలనీయమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఆర్‌డీడబ్ల్యూఎఫ్ ప్రతినిధులు కే అజయ్‌బాబు, జే కుమారస్వామి, సత్యనారాయణ, జీ రాములు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### బీపీటీఎంఎం ఆధ్వర్యంలో

భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ ఫోర్ట్ మజ్దూర్ మహాసంఘం(బీపీటీఎంఎం) ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో న్యాయ సంహిత చట్టం జిరాక్స్ పత్రాలను తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి మాట్లాడుతూ.. న్యాయ సంహిత చట్టాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు హబీబ్, శంకర్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మోటార్ వాహన బిల్లు రద్దు చేయాలి

కేంద్రం మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వీఎస్ బోస్, ప్రధాన కార్యదర్శి బీ వెంకటేశం డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఫెడరేషన్ సమావేశం జరిగింది. డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేయాలని దురుద్దేశంతో హిట్ అండ్ రన్ చట్టాన్ని తీసుకొచ్చారని విమర్శించారు.

## అమ్మాయిలా స్నేహం ..ఆపై మోసం!

- మార్ఫింగ్ ఫొటోలతో వేధింపులు
- వైరల్ చేస్తానంటూ బెదిరింపులు
- నగ్నవీడియోలు పంపాలని డిమాండ్
- సైబర్‌క్రైమ్ పోలీసులకు చిక్కిన ఇంజినీరింగ్ విద్యార్థి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ఇన్‌స్టాగ్రామ్‌లో అమ్మాయి పేరుతో నకిలీ ఖాతా సృష్టించి, బాలికలు, యువతులతో పరిచయాలు పెంచుకుని, నగ్న ఫొటోలు పంపించాలంటూ వేధిస్తున్నాడో ప్రబుద్ధుడు. ఇన్‌స్టాలో పరిచయమైన మహిళల ఫొటోలను మార్ఫింగ్ చేసి వారి జీవితాలతో ఆటలాడుకుంటున్న సైబర్ నేరగాడిని సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. జాయింట్ సీపీ రంగనాథ్ కథనం ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన ఎస్ జిష్ణుకీర్తన్‌రెడ్డి బీటెక్ చదువుతున్నాడు. అమ్మాయిల పేరుతో ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేశాడు. ఆ అకౌంట్ డీపీలో అమ్మాయి ఫొటో పెట్టడంతో అతడిని అమ్మాయిగానే భావించి పలువురు ఫ్రెండ్‌షిప్ చేశారు. స్నేహ హస్తం చాచిన అమ్మాయిలతో చాటింగ్ చేస్తూ, వారి ఫొటోలు సేకరించేవాడు. వాటిని మార్ఫింగ్ చేసి వారికే పంపించేవాడు. వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేయకుండా ఉండాలంటే.. ప్రతిరోజూ తనకు నగ్నఫోటోలు, వీడియోలు పంపించాలని బెదిరించేవాడు. , లేదంటే సోషల్‌మీడియాలో పరువు తీస్తానని బెదిరించేవాడు. ఇటీవల ఒక బాలికను ఇలాగే ట్రాప్ చేశాడు. ఆమెకు మార్ఫింగ్ ఫోటోలు పంపించి బెదిరించాడు. ప్రతిరోజూ నగ్నఫొటోలు పంపించకపోతే తన వద్ద ఉన్న ఫొటోలను వైరల్ చేస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేశాడు. బాధితురాలు ఈ విషయాన్ని తన తల్లికి చెప్పింది. దీంతో ఆమె సీసీఎస్ సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని ఇన్‌స్పెక్టర్ పద్మ నేతృత్వంలోని బృందం దర్యాప్తు జరిపి, నిందితుడు కీర్తన్‌రెడ్డిగా గుర్తించి బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడి ఫోన్‌ను సైబర్‌క్రైమ్ పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఫేక్ ఐడీతో అనేక మందితో చాటింగ్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఎంతమంది బాధితులు ఉన్నారు? వారు ఎక్కడ ఉంటారనే విషయంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## కొండెక్కిన కోడిగుడ్డు

- గణనీయంగా పెరిగిన గుడ్ల వినియోగం
- ఎగ్స్ ట్రే రూ.180 నుంచి రూ.200
- చలి తీవ్రతతో ఉత్పత్తి తగ్గుముఖం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కోడిగుడ్ల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కార్తిక మాసం ముగిసిన తర్వాత గుడ్ల వినియోగం విపరీతంగా పెరగటమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. గత నెలలో ఒక్కో గుడ్డు ధర రూ.5.50 ఉండగా, వారం క్రితం రూ.6కు చేరుకున్నది. తాజాగా రూ.7 నుంచి 8గా పలుకుతున్నది.

### వారం రోజులుగా అధిక ధర

వారం రోజుల్లోనే డజను గుడ్ల ధర రూ.72 నుంచి ఏకంగా రూ.84కు చేరటం గమనార్హం. హోల్‌సేల్‌లో గుడ్డు ధర రూ.5.76 ఉండగా, రిటైల్‌లో రూ.7కు అమ్ముతున్నారు. కొన్ని వీధుల్లో రూ.7.50, రూ.8కూ విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ట్రే (30 గుడ్లు) ధర రూ.180 నుంచి రూ.200 కాగా, రిటైల్ మార్కెట్‌లో రూ.7 నుంచి రూ.8కి అమ్ముతున్నారు.

### పెరిగిన చలి.. తగ్గిన ఉత్పత్తి

రాష్ట్రంలో 1,100 కోళ్ల ఫారాలు ఉన్నాయి. గుడ్ల ఉత్పత్తిలో దేశంలో తెలంగాణది మూడో స్థానం. రాష్ట్రంలో ఏటా 17.67 బిలియన్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. గత 20 రోజులుగా చలి తీవ్రత పెరిగింది. కోళ్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడి గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గింది. క్వింటాలు సోయాచెక్క దాణా ధర ఏడాది క్రితం రూ.5 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.7,200, మొక్కజొన్న క్వింటాలుకు రూ.1,800 నుంచి రూ.2 వేలకు పెరిగింది. వాహనదారులు రవాణా చార్జీలు 15 శాతం పెంచడం గుడ్ల ధర పెరగడానికి కారణమని పౌల్ట్రీవర్గాలు చెబుతున్నాయి.

### హైదరాబాద్‌లో రోజుకు కోటి కోడిగుడ్ల విక్రయం

హైదరాబాద్‌లో సాధారణంగా రోజుకు 80 లక్షలు, రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో 60 లక్షల వరకు కోడిగుడ్లు అమ్ముడుపోతుంటాయి. వారం రోజుల నుంచి ఇతర జిల్లాల్లో 70 లక్షల వరకు గుడ్లు అమ్ముడుపోగా, హైదరాబాద్ నగరంలో కోటి దాటాయి. కరోనా కేసులు, చలి తీవ్రతతో ప్రొటీన్ వినియోగం పెరిగిన దరిమిలా కోడిగుడ్ల ధరల పెరిగాయని వ్యాపారులు భావిస్తున్నారు.

## సర్కారు బడులకు గృహ విద్యుత్తు కనెక్షన్లు!

- ప్రస్తుతం కమర్షియల్ కనెక్షన్లు
- త్వరలోనే క్యాటగిరీ మార్చే అవకాశం
- తగ్గనున్న బిల్లుల భారం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు బడులకు త్వరలో విద్యుత్తు బిల్లుల భారం తప్పనున్నది. బడుల విద్యుత్తు కనెక్షన్లను కమర్షియల్ క్యాటగిరీ నుంచి డొమెస్టిక్ క్యాటగిరీకి ప్రభుత్వ మార్చనున్నది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే మౌఖిక ఆదేశాలివ్వగా, త్వరలో పూర్తిస్తాయి అమలుకు విద్యాశాఖ అధికారులు సన్నాహకాలు చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం రాష్ట్రంలో 26,074 బడులుండగా, వీటిల్లో 24,084 బడులకు విద్యుత్తు కనెక్షన్లున్నాయి. మరో 1,990 బడులకు ఇప్పటివరకు కరెంట్ కనెక్షన్లు లేవు. ఇటీవలికాలంలో విద్యుత్తు ఉపకరణాల వినియోగం పెరగడంతో బడులకు విద్యుత్తు బిల్లులు అమాంతం పెరుగుతున్నాయి. కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రయోగశాలలు, బోర్‌మోటర్లకు విద్యుత్తు వినియోగంతో బిల్లులు తలకుమించిన భారంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలోనే విద్యుత్తు కనెక్షన్ల క్యాటగిరీని మార్చాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. గృహజ్యోతి పథకంలో వర్తింపజేసే 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇదే అంశంపై ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. గృహ క్యాటగిరీకి మార్చేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.

### కొన్ని బడుల గత బిల్లులు..

| పాఠశాల | బిల్లు మొత్తం |
|---|---|
| జెడ్పీహెచ్ఎస్ శామీర్‌పేట | రూ.8106 |
| ఎంపీపీఎస్ జవహర్‌నగర్ | రూ.1139 |
| జెడ్పీహెచ్ఎస్ బాలానగర్ | రూ.3000 |
| ఎంపీపీఎస్ బాచుపల్లి | రూ.1300 |

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో..

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో కింది ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 30
- పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- సబ్జెక్టులు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మెడికల్ సైన్సెస్, హిందీ, ఉర్దూ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 25
- వెబ్‌సైట్: https://uohyd.ac.in

### బెల్‌లో..

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 5
- పోస్టులు: ప్రాజెక్ట్ ఇంజినీర్
- అర్హతలు: బీఈ/బీటెక్ (ఎలక్ట్రానిక్స్/ఈ అండ్ సీ)
- నోట్: వీటితోపాటు ప్రాజెక్ట్ ఇంజినీర్–12 పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 25
- వెబ్‌సైట్: www.bel-india.in

### ఎన్‌టీపీసీలో..

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 25
- పోస్టులు: అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్)
- అర్హతలు: సీఏ/సీఎంఏ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 18
- వెబ్‌సైట్: www.ntpc.co.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- విపత్తు నిర్వహణ, తెలుగు, మెథడాలజీ (గ్రూప్స్, టెట్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.